జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 26-06-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 55 పేజీలు: 4 వెల : రూ.7

# ప్రైవేట్ బస్సులపై.. ప్రేమతో..





* పాలకొండ రోడ్డులో అడ్డంగా ప్రైవేట్ బస్సుల పార్కింగ్
* సాయంత్రమైతే ఈ రోడ్డులో ట్రాఫిక్ జాం
* అటువైపు కన్నెత్తి చూడని ట్రాఫిక్ పోలీసులు
* ఆటోలపై కొరడా ఝుళిపిస్తూ.. బస్సులపై ఏంటో మమకారం
* మర్మమేమిటో అర్థం కావడం లేదంటున్న నగరవాసులు

**శ్రీకాకుళం క్రైం, జూన్ 25 (వార్త):** ట్రాఫిక్ సీఐ అవతారం సార్.. శ్రీకాకుళం నగరంలో బాధ్యతలు తీసుకున్న తర్వాత ట్రాఫిక్ సమస్యపై గట్టిగానే చర్యలు చేపట్టారు. నేనున్నాను అన్నట్టుగానే నగరంలోని ప్రధాన రహదారులపై మరీ నిఘా వేసి ట్రాఫిక్‌ను కంట్రోల్ చేశారు. ద్విచక్రవాహనదారుడి నుంచి ఆటోవాలా, కార్‌వాలా.. బస్సువాలా ఇలా అందరిపై కొరడా ఝులిపించారు. అంబేద్కర్ జంక్షన్ రోడ్డు నుంచి ఆర్ట్ కళాశాలకు వెళ్లే రోడ్డులో, జీటీ రోడ్డు, పాలకొండ రోడ్డు, సెవన్‌రోడ్డు జంక్షన్, పాతబస్టాండ్, అరసవల్లి తదితర జంక్షన్లలో నలుగురైదుగురు పోలీసులతో రోడ్డుపైనే ఉండి ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకున్నారు. ఆటో డ్రైవర్లు ఎవరైనా నిబంధనలు పాటించకపోతే గట్టిగానే ఫైన్లు వేశారు. అంతా బాగుంది గాని.. పాలకొండ రోడ్డులోని బలగ పెట్రోల్ బంకు నుంచి శివాలయం వరకూ ప్రైవేట్ బస్సుల పార్కింగ్‌ను మాత్రం ఎందుకనో అడ్డుకోలేకపోయారు. సాయంత్రం ఐదు గంటల నుంచి హైదరాబాద్, విజయవాడ వెళ్లే బస్సులన్నీ ఈ రోడ్డుపైనే నిలుపుదల చేసి ప్రయాణికులను ఎక్కించుకుని వెళతారు. అసలే ఇరుకు రోడ్డు కావడం, సాయంత్రం వేళ వాహనాల రద్దీ.. దీనికితోడు ఈ ప్రైవేట్ బస్సులు రోడ్డుకు అడ్డంగా పార్కింగ్ వల్ల కొన్ని సమయాల్లో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇటీవల ఈ డేఅండ్ నైట్ జంక్షన్ వద్ద కల్వర్టు పనులు చేపట్టారు. ఆ సమయంలో ఈ ప్రైవేట్ బస్సులను కొత్తరోడ్డు నుంచి మళ్లించారు. దీనివల్ల పాలకొండ రోడ్డుపై ట్రాఫిక్ జాం.. ఊసేలేకుండా పోయింది. నగరవాసులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ఈ రోడ్డులో ప్రయాణించేవారు, ఈ రోడ్డులో నివాసం, వ్యాపారాలు చేసుకునేవారు కూడా ఊపిరిపీల్చుకున్నారు. ప్రైవేట్ బస్సులను కొత్తరోడ్డు నుంచి మళ్లిస్తే బాగున్ను.. అని అందరూ అభిప్రాయపడ్డారు. డేఅండ్ నైట్ జంక్షన్ వద్ద కల్వర్టు నిర్మాణం పూర్తికావడంతో మళ్లీ ఈ ప్రైవేట్ బస్సులు నగరం నుంచే రాకపోకలు చేస్తున్నాయి. ఈ బస్సులను సాయంత్రంపూట నగరంలోకి రానీయవద్దని పలువురు పోలీసు బాస్‌లను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. కనీసం ఆ ప్రాంతంలో ట్రాఫిక్ జాం కాకుండా కానిస్టేబుల్‌ను కూడా బందోబస్తు నిమిత్తం ఉంచిన దాఖలాలు లేవు. దీని వెనుక మర్మమేమిటో ఆ ట్రాఫిక్ పోలీసులకు.. బాస్‌లకు.. ఆ సర్వాంతర్యామికే ఎరుక.



# నిబంధనలకు తిలోదకాలు

* ఇష్టారాజ్యంగా రొయ్యల హెచరీలు ఏర్పాటు * నిబంధనలకు అతిక్రమిస్తున్న యజమానులు
* అటవీ భూముల్లో అక్రమ తవ్వకాలు * అక్రమంగా సముద్రపు నీరు తరలింపు * దర్యాప్తు చేస్తే నిజాలు వెలుగులోకి * మండల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం

**సంతబొమ్మాళి, జూన్25(వార్త):** సంతబొమ్మాళి మండలంలో రొయ్యలసాగు విస్తారంగా సాగుతోంది. తీర ప్రాంతం కావడంతో ఈ వ్యాపారం మూడు రొయ్యలు.. ఆరు చేపలు మాదిరిగా సాగుతోంది. వ్యాపారులకు ఈ వ్యాపారం కాసులు కురిపిస్తుండడంతో నిబంధనలకు తిలోదకాలిస్తూ రొయ్యల సాగు చేస్తున్నారు. ఎటువంటి అనుమతుల్లేకుండా, ఒకవేళ అనుమతులు ఉన్నా నిబంధనలు పాటించకుండా వ్యాపారాలు చేస్తున్నారు. ఉదాహరణకు పాత మేఘవరంలో సాయి పవన్ రొయ్యల హేచరీ ఉంది. ఎటువంటి అనుమతులు లేకుండా ఫారెస్ట్ భూముల్లో అక్రమ తవ్వకాలు జరిపి, సముద్రంలోని వరకు పైపులైన్ వేసి సముద్రపు నీరు అక్రమంగా తరలిస్తున్నారు. ఈవిషయమై కొందరు అటు రెవెన్యూ, ఇటు ఫారెస్ట్, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీంతో సంబంధిత యాజమాన్యం అంతా మా ఇష్టం అన్న చందంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. గతంలో ఇదే హెచరీపై కేసులు ఫైల్ అయినట్లు సమాచారం.









సంబంధిత అధికారులకు కాసులు ముడుతుండడంతో నిబంధనలకు విరుద్ధంగ సాగువున్న రొయ్యల హెచరీలపై కన్నెత్తి చూడడం లేదని పలువురు అనుకుంటున్నారు.

## హెచరీపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

సంతబొమ్మాళి మండలం పాత మేఘవరంలో ప్రభుత్వ అటవీ భూములు ఆక్రమించుకొని అక్రమంగా నిర్వహిస్తున్న రొయ్యల హెచరీపై చర్యలు చేపట్టాలని మేఘవరం పంచాయతీకి చెందిన టీడీపీ నాయకుడు సూరాడ ధనరాజు మంగళవారం తహసీల్దార్ సత్యన్నారాయణకు ఫిర్యాదు చేశాడు. హెచరీకి సొంత భూమి కొంత ఉన్నా చుట్టూ ఉన్న ప్రభుత్వం భూమి, అటవీ భూములను ఆక్రమించేశాడని, రొయ్య పిల్లలు పెంపకం కోసం అటవీ భూములు మీదుగా ఎటువంటి అనుమతులు లేకుండా సముద్రం నీటిని అక్రమంగా తరలిస్తున్నాడని అధికారుల వద్ద వాపోయారు. తక్షణం చర్యలు తీసుకోవాలని లేకుంటే మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళతామని ధనరాజు తహసీల్దార్‌ను కోరారు.

# ప్రతీ హామీ నెరవేరుస్తా

* శ్రీకాకుళం నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలుపుతా
* రైతులకు అందుబాటులో వరి విత్తనాలు
* ఎమ్మెల్యే గొండు శంకర్



**శ్రీకాకుళం, జూన్ 25 (వార్త):** నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శాసనసభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా విశాఖ ఏ కాలనీలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఇచ్చిన ప్రతీ హామీని ప్రాధాన్యత క్రమంలో నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పెంచిన పెన్షన్ బకాయిలతో పాటు ఏడువేల రూపాయల పెన్షన్ పంపిణితో జులై ఒకటవ తేదీన పండగ వాతావరణం నెలకొనబోతోందని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. అన్ని వర్గాల ప్రయోజనాలను కాపాడేందుకు, వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఎన్నికల్లో తనకు ఘన విజయాన్ని అందించిన ప్రజలకు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ మాటకు కట్టుబడి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించానని తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా చర్యలు చేపట్టమన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల కంటే అదనంగా 350 క్వింటాళ్ల వరి విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. అదేవిధంగా శ్రీకాకుళం, ఆమదాలవలస ప్రధాన రహదారి మరమ్మత్తు పనులు చురుకుగా జరుగుతున్నాయని తెలిపారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఎన్నికల గురించి మున్సిపల్ శాఖమంత్రి నారాయణతో మాట్లాడడం జరిగిందని, అసంపూర్తిగా నిలిచిపోయిన స్టేడియం నిర్మాణ పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. నిలిచిపోయిన టెండర్ పనులను పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. విలీన పంచాయతీల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామని, కలెక్టర్‌తో సమావేశమై చర్యలు తీదుకోవడం జరుగుతుందని చెప్పారు. తనపై నమ్మకంతో అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రజలకు సంరక్షకుడిలా ఉంటానని, ఎప్పుడు పిలిచినా తక్షణమే స్పందిస్తానని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ సమస్యలను గుర్తించడం జరిగిందని, ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరిస్తానని హామీ నిచ్చారు. బుధవారం నుంచి శాఖలా వారీగా సమీక్షలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నెంబర్ వన్ గా నిలపడానికి ప్రజలు, పార్టీ నాయకులు సహకరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## అధికారం బాధ్యతను పెంచింది




**పలాస, జూన్ 25 (వార్త):** సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి విజయంతో మరింత బాధ్యత పెరిగిందని జనసేన పార్టీ పలాస నియోజకవర్గ నాయకుడు పట్టి ఉదయ్ కిరణ్ అన్నారు. మంగళవారం ఆయన తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం పదవి చేపట్టిన తరువాత తన శాఖకు సంబంధించిన అభివృద్ధి అంశాలలో ప్రజలకు భాగస్వామ్యులని చేయడానికి సలహాలు, సూచనలు తీసుకోవడం అభినందనీయమన్నారు. దశాబ్ద కాలం తరువాత కేంద్ర మంత్రి పదవి శ్రీకాకుళం జిల్లాకు వరించడం అది కూడా యంగ్ డైనమిక్ లీడర్ కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. పలాస నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టిసారించాలన్నారు. వంశధార ఎడమ కాలువ నీటిని పంటపొలాలకు అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు చేయిస్తున్నారని తెలిపారు.

### రైతుల నుంచి ముందుగా...
# నగదు తీసుకోవద్దు

***ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉంచాలి * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు * వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల అధికారులతో సమీక్ష**



**విజయవాడ, జూన్25 (వార్త):** విజయవాడ వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల అధికారులతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు ఎరువుల కోసం ముందుగా నగదు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఎరువులు తీసుకున్నప్పుడే నగదు చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఇబ్బందులు పెట్టిందని, మనం అలా చేయకూడదన్నారు. తక్షణమే ఖరీఫ్ సీజన్ కోసం రైతులకు అవసరమైన ఎరువులు సిద్ధం చేయాలన్నారు. అన్ని జిల్లాల్లో భూసార పరీక్షలు చేసేందుకు భూసార పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల నమూనాలు సేకరించి ఫలితాలు తక్షణమే విడుదల చేయాలని సూచించారు. వైసీపీ ప్రభుత్వంలో ఏడాదికి కూడా భూసార పరీక్షల ఫలితాలు విడుదల కాకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారని తెలిపారు. అన్ని రకాల విత్తనాలు రాయితీపై అందించేందుకు సమాయత్తం కావాలన్నారు. గడిచిన ఐదేళ్లలో ఒక్క రైతుకు కూడా వ్యక్తిగతంగా రాయితీలో యంత్ర పరికరాలు అందించలేదని, మన ప్రభుత్వ హయాంలో అటువంటి పరిస్థితి రాకుండా చూడాలన్నారు. గత ప్రభుత్వంలో రాయితీలో గ్రూప్ లకు అందించిన ట్రాక్టర్ల పంపిణీలో భారీ అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు వస్తున్నాయని వాటిపై నివేదిక ఇవ్వాలన్నారు. భవనాలకు రంగులు మార్చే వృధా ఖర్చులు చేయవద్దని మంత్రి అచ్చెన్నాయుడు సంబంధిత అధికారులకు సూచించారు.



## పథకాలను వినియోగించుకోండి

**గార, జూన్25 (వార్త):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని శాసనసభ్యుడు గొండు శంకర్ సూచించారు. నియోజకవర్గ పరిధిలోని గార మండల కేంద్రంలో సబ్సిడీ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శంకర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత ప్రభుత్వం దేశానికి వెన్నెముక లాంటి రైతన్న నడ్డి విరిచిందని ఆరోపించారు. సకాలంలో విత్తనాలు, ఎరువులు అందక, అష్టకష్టాలు పడి పంట పండించినా గిట్టుబాటు ధర లేక, బిల్లులు చెల్లించకపోవడంతో రైతాంగం గడ్డు పరిస్థితులు ఎదుర్కొందన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతుకు అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వరుణుడు కూడా కరుణించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, మేలైన, అధిక దిగుబడిని ఇచ్చే విత్తనాలను వ్యవసాయశాఖ ద్వారా సిద్ధంగా ఉంచడం జరిగిందని చెప్పారు. సబ్సిడీ విత్తనాలు, ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకుని, అధిక దిగుబడులు సాధించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడి జి.రజని, ఏఓ డి. పద్మావతి, ఎంపీడీఓ బి. కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## అమ్మోరు సంబరాల్లో శిరీష దంపతులు



**పలాస, జూన్ 25(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో జరుగుతున్న అమ్మవారి సంబరాల్లో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, వెంకన్న చౌదరి దంపతులు పాల్గొన్నారు. అమ్మవారికి పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.



## కంచుమయమ్మ తల్లికి చల్లదనం

**మందస, జూన్ 25(వార్త):** మందస పట్టణం శివారులో ఉన్న కంచమయమ్మ కాలనీలో తల్లి అమ్మవారి చల్లదనం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. భక్తులు ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారి సంబరాలు సందర్భంగా ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## కమ్యూనిస్ట్ నేత ఓంకార్ మాస్టారు మృతి



**పలాస, జూన్ 25(వార్త):** ఉద్దానం కమ్యూనిస్ట్ నాయకుడు ఓంకార్ మాస్టారు అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెందారు. సీపీఎం జిల్లా కమిటీ సంతాపం తెలుపుతూ ఒక ప్రకటనను విడుదల చేసింది. ఓంకార్ మాస్టారు తన 9వ తరగతి చదువుతున్న రోజుల్లోనే ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘంలో చేరి, శ్రీకాకుళం జిల్లా కమిటీ బాధ్యుడిగా విద్యార్థుల సమస్యలపై పోరాటం చేశారు. ఆంధ్ర యూనివర్సిటీ పీజీలో చేరిన తర్వాత ఎస్ఎఫ్ఐ ఏయూ విద్యార్థి సంఘానికి నాయకత్వం వహించి అనేక ఉద్యమాల్లో పాల్గొ న్నారు. ఆతర్వాత కాలంలో సిపిఎంలో చేరి పార్టీ పిలుపుమేరకు ప్రజా సమస్యలపై జరిగిన పోరాటాల్లో నాయకత్వం వహించారు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన తర్వాత ఐక్య ఉపాధ్యాయ సంఘం యూటీఫ్‌లో చేరి, ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాలు చేశారు. అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న ఉద్దానం అభి వృద్ధి చెందాలని ఉద్దానప్రాంత విద్యా అభివృద్ధి వేదిక (యువీవీ)వ్యవస్థాపకుల్లో ఒకరిగా, విద్యా సాంస్కృతిక రంగాల్లోనే కాకుండా, ఉద్దానకిడ్నీ వ్యాధిపై కూడా అనేక పోరాటాలు చేశారు. నీలావతిలో యువివి గ్రంథాలయం నిర్మాణంలో చురుకైన పాత్ర వహించి, అనేక పుస్తకాల సేకరించి అందుబాటులోకి తెచ్చిన వ్యక్తి ఓంకార్ మాస్టారు. ఏ ఉద్యమంలోనైన మమేకమై డప్పు కొట్టి, పాట పాడి ప్రజలగొంతుక అయ్యారు. కాగా, ఓంకార్ మృతి తీరని లోటని విప్లవ ప్రజాసంఘాలు నేతలు తాంద్ర ప్రకాష్, గొరకల బాలకృష్ణ, సన్నశెట్టి రాజశేఖర్, పోతనపల్లి కుసుమ, సార జగన్ అన్నారు.

### మాదకద్రవ్యాల వాడకంతో..
# జీవితాలు నాశనం



**బూర్జ, జూన్25(వార్త):** యువత మాదక ద్రవ్యాల జోలికి పోయి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ జీ.వి ప్రసాద్ కోరారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కళాశాలలు, ఇతర ప్రాంతాల్లో డ్రగ్స్ సేవిస్తున్నా, విక్రయిస్తున్నా ఆ సమాచారం తమకు అందిస్తే చర్యలు తీసుకుంటామని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తోపాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

### మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**ఇచ్ఛాపురం, జూన్ 25 (వార్త):** మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ టి. ఇమ్మానుయేల్ రాజు అన్నారు. స్థానిక జ్ఞాన భారతి స్కూల్లో సీఐ ఆధ్వర్యంలో జ్ఞాన భారతి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సీఈవో, కార్యదర్శి జోహార్ ఖాన్ అధ్యక్షతన డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి సీఐ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయ్ వంటి మత్తు పదార్థాలు వాడకం వల్ల జీవితాలు నాశనమవుతాయన్నారు. విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలన్నారు. ఇటీవలే ఒక ఎంబీఏ విద్యార్థి గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడని, ప్రస్తుతం జైలు శిక్ష అనుభవిస్తున్నాడని తెలిపారు. విద్యార్థులు, యువత తమ తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకూడదని హితవు పలికారు. జోహార్ ఖాన్ మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం తమ లక్ష్యాలపై దృష్టి పెట్టాలని, చెడు అలవాట్లకు దగ్గరగా ఉన్న వారి దగ్గరకు వెళ్ళకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై వి.సత్యనారాయణ, జ్ఞానభారతి ఎడ్యుకేషనల్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఇందు భూషణ్ పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అడిషనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సయ్యదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్ పాల్గొన్నారు.




### మాదక ద్రవ్యాలను వాడొద్దు

**హిరమండలం, జూన్ 25(వార్త):** మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల భవిష్యత్ నాశనం అవుతుందని హెడ్ కానిస్టేబుల్ గోవిందరావు సూచించారు. మంగళవారం మండలం కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే మంచి లక్షణాలు కలిగి ఉండాలన్నారు. కొందరు చెడు వ్యసనాలకు బానిసై జీవితాలు పాడుచేసుకుంటున్నారన్నారు. ఉన్నత స్థాయిలోకి చేరాలంటే మంచి లక్షణాలు కలిగి ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పిఈఎస్ఎన్ పట్నాయిక్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



## పవనపుత్ర సేవా సంస్థ నూతన కార్యవర్గం

**మందస, జూన్ 25(వార్త):** శ్రీ పవనపుత్ర సేవా సంస్థ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. పవనపుత్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో గత నాలుగు సంవత్సరాలుగా ఎన్నో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఎంతోమందిని రక్తదాతలుగా మార్చిన సంస్థ ప్రతినిదులు విద్యార్థులకు క్విజ్ పోటీలు, టాలెంట్ టెస్ట్‌లు నిర్వహణ, స్టడీ మెటీరియల్ అందించడం, ఆపదలో ఉన్నవారికి నిత్యావసర సరుకుల పంపిణీ, ఆర్థిక సహాయం అందించడం వంటి ఎన్నో కార్యక్రమాలను చేశారు. మంగళవారం కోర్ కమిటి సభ్యులు సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఆశపన్న బాలరాజు, ఉపాధ్యక్షుడు పిరికట్ల చలపతి, కార్యదర్శి రాపాక కేశవరావు, సంయుక్త కార్యదర్శి తిరుపతి గౌడ, కోశాధికారి ఇప్పిలి ప్రదీప్‌లను ఎన్నుకున్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి

**పలాస, జూన్ 25 (వార్త):** పశుసంవర్ధక శాఖ, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులతో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి ఇంటిలో అదనపు ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. పాడి పరిశ్రమలపై రైతులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో టీడీపీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి, జెడి శ్రీధర్, అధికారులు, టిడిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





## కురుంపేటలో ఈకేవైసీ స్పెషల్ డ్రైవ్

**బూర్జ, జూన్ 25(వార్త):** వంటగ్యాస్ వినియోగదారులకు ప్రభుత్వం ఈకేవైసీని తప్పనిసరి చేసింది. గ్యాస్ ఏజెన్సీ శ్రీకాకుళం నగరంలో ఉండడం వల్ల ప్రజలు వెళ్లి రావటానికి ఖర్చుతో పాటు ఒకరోజు సమయం వెచ్చించాల్సి ఉంటుంది. సమస్యను గమనించిన టీడీపీ యువనాయకుడు కత్తెర అశోక్, సర్పంచ్ కొరికాన వెంకట శివ సాయి సీతారామరాజు ఎమ్మెల్యే కూన రవి కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే చొరవతో ప్రియ లక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్ భారత్ గ్యాస్ ప్రతినిధులు కురుంపేట శివాలయం వద్ద ఈకేవైసీ స్పెషల్ డ్రైవ్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. పంచాయతీకి నలువైపులా ఉన్న చిన్నకురుంపేట, కె కె రాజపురం, పి ఎల్ దెవిపేట, టీ ఆర్ రాజుపేట, అప్పలపేట గ్రామాలకు చెందిన సుమారు 200 మందికి పైగా లబ్దిదారులు ఈ సేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా భారత్ గ్యాస్ జిల్లా మేనేజర్ నీలంరాజు మాట్లాడుతూ సమయానికి సిలిండర్లను లబ్ధిదారుల ఇంటి వద్దకే అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాడ శ్రీనివాసరావు, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు వైసీపీ ప్రత్యేక సమావేశం

**మందస, జూన్ 25 (వార్త):** వైసీపీ క్యాడర్‌తో ప్రత్యేక సమావేశాన్ని కాశీబుగ్గలో బుధవారం నిర్వహించనున్నామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు ప్రగతి భవన్ కార్యాలయం వద్ద మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం ఉంటుందన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు హాజరు కావాలని కోరారు.

## 27న మినీ ఉద్యోగమేళా

**శ్రీకాకుళం టౌన్, జూన్ 25 (వార్త):** శ్రీకాకుళం నెహ్రూ యువజన కేంద్రంలో ఈనెల 27న మినీ ఉద్యోగమేళా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఎస్.కె సేఫ్టీ వింగ్స్ ప్రైవేట్ సంస్థలో పనిచేసేందుకు 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాలలోపు ఉన్న యువతీ యువకులు పాల్గొనవచ్చన్నారు. గౌరవభృతి కింద రూ.16వేలు నుంచి రూ.18వేలు ఉంటుందని, పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు.


## బెల్లుపడ కాలనీలో 'నేను బడికి పోతా'



**ఇచ్ఛాపురం, జూన్ 25 (వార్త):** బెల్లుపడ కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఆధ్వర్యంలో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరుతూ ఉపాధ్యాయులు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కె.అప్పారావు, హెచ్ఎం అమ్మన్నమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీ

**నరసన్నపేట, జూన్ 25 (వార్త):** నరసన్నపేట మండల పరిధిలో పెద్దపేట దగ్గర ఉన్న శ్రీ శక్తి ఆంజనేయ దేవస్థానంలో చోరీ జరిగింది. మంగళవారం ఉదయం పూజారి ఆలయ తలుపులు తీశారు. సుమారు కేజీ వెండి వస్తువులు, రూ.10వేలు నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. సోమవారం అర్ధరాత్రి దొంగతనం జరిగివుంటుందని పోలీసులు చెబుతున్నారు. దొంగతనానికి దుండగులు తీసుకువచ్చిన ఇనుప సామగ్రిని ఆలయంలో వదిలి వెళ్లారు. సీసీ కెమెరాలకు పట్టుబడకుండా దుండగులు పేస్టును రాసినట్టు పోలీసులు గుర్తించారు. క్లూస్ టీం ఆలయంతో పాటు పరిసరాలను పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.




# నీట్ ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారించండి

* కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి
* విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి
* కార్పొరేట్ ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల దోపిడీని అరికట్టాలి
* ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నేతల డిమాండ్




**శ్రీకాకుళం టౌన్, జూన్ 25 (వార్త):** ఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్), అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నేతల ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని అసరవల్లి జంక్షన్ వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవి, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన నీటి పరీక్షలో అక్రమాలు జరిగాయన్నారు. ఈ ఫలితాలలో దేశవ్యాప్తంగా 67మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 రావడం, అందులో ఆ ఆరుగురు విద్యార్థులు హర్యానాలోని ఒకే సెంటర్‌కి సంబంధించి రావడం వెనుక బీహార్‌కు చెందిన ముఠా ఒక్కొక్క విద్యార్థి దగ్గర నుండి 30 లక్షలు వసూలు చేసి దొరికిన కూడా వారిని ఇంతవరకు అరెస్టు చేయకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షని రద్దు చేయాలని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు చెప్తున్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా వేలాదిమంది ప్రతిభ గల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతున్నారన్నారు. పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. యుజిసి నెట్ పేపర్ లీకేజీ అయిందని కేంద్ర విద్యాశాఖ అధికారులు రద్దు చేశారని నీట్ పేపర్ ఎందుకు రద్దు చేయరో 24 లక్షల విద్యార్థుల తల్లిదండ్రులకు సమాధానం చెప్పాలని కోరారు. గ్రేస్ మార్కులు కలిపిన విద్యార్థులకు మాత్రమే పరీక్ష నిర్వహిస్తామని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందని 24 లక్షల మంది విద్యార్థులకు మళ్లీ నీట్ పరీక్ష నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని లేనిపక్షంలో వారి కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లలో ఫీజుల దోపిడీపై విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు కిరణ్ కుమార్, చందు, సాయి, ప్రదీప్ పాల్గొన్నారు.




## డిజిటల్ చెల్లింపులపై అవగాహన అవసరం

**బూర్జ, జూన్25 (వార్త):** డిజిటల్ చెల్లింపులు, నగదురహిత లావాదేవీల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకొని ఆచరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ కె.సతీష్ అన్నారు. గురువారం బూర్జ సచివాలయంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు, వి.అశోక్ కుమార్ పర్యవేక్షించారు. బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ కె.సతీష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బ్యాంకింగ్ ఫోల్డర్‌లో చేర్చబడాలని, ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలన్నారు. బ్యాంకు సేవలను వినియోగించుకోవాలన్నారు. బ్యాంక్ వైపు మొదటి అడుగు, డిపాజిట్ ఖాతాలు, లావాదేవీలపై రిసోర్స్ పర్సన్ ఎ.హరనాథ్, ట్రైనర్స్ యు.రాజేష్, బి.చంద్రశేఖర్ రావులు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఎం.రవీంద్రబాబు, ఎపిఎం పి.బాబూరావు, ఎంపీటీసీ పోలినాయుడు, సర్పంచ్ అనూరాధ, ఏఎస్ఐ ఎం.వి.రమణ, బ్యాంక్ కరస్పాండెంట్ కె.వెంకటరమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పు ఉత్పత్తిదారుల లీజులు పునరుద్ధరించాలి

**సంతబొమ్మాళి, జూన్ 25 (వార్త):** రాష్ట్రంలో ఉప్పు పరిశ్రమ మనుగడ సాధించాలంటే ఉప్పు ఉత్పత్తిదారుల లీజులను పునరుద్ధరించాలని రాష్ట్ర ఉప్పు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు, నౌపడ మాజీ సర్పంచ్ పీరుపల్లి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఉప్పు పరిశ్రమ శాఖ కమిషనర్ ప్రేరణ జోషికు కాకినాడలో వినతి పత్రం అందించారు. 2013 సంవత్సరం నుంచి ఉప్పు ఉత్పత్తిదారులు లీజులు నిలిచిపోవడంతో వేలాదిమంది కార్మికులకు ఉపాధి లేకుండా లేక లైసెన్స్ దారులు, కార్మికులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. లీజులు పునరుద్ధరించడంతో పాటు అసైన్మెంట్ ఫీజులు తగ్గించాలని కోరారు. టెండర్ విధానంలో ఉప్పు భూములు అప్పగించాలని కోరారు. ఈ ఏడాది రాష్ట్రంలో ఉప్పు సాగు ఆశించిన స్థాయిలో లేదని, రాష్ట్రంలో ఉప్పు పరిశ్రమ మనుగడ సాధించాలంటే లీజులు పునరుద్ధరణ చేయలాని కోరారు. ఈ కార్యక్రమంలో కాకినాడ అసోసియేషన్ ప్రెసిడెంట్ మాచారావు, భీమిలి అసోసియేషన్ ప్రెసిడెంట్ మల్లికార్జునరావు, బుచ్చిబాబు, సంతోష్ కుమార్, నౌపడ డిప్యూటీ సూపర్ రెంటెండ్ ఆఫ్ సాల్ట్ షేక్ ముజ్రేల్ ఇస్లామ్ పాల్గొన్నారు.



# 27న నిమ్మక జయకృష్ణ విజయోత్సవ ర్యాలీ

**వీరఘట్టం, జూన్ 25 (వార్త):** సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన నిమ్మక జయకృష్ణ అఖండ విజయం సాధించి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మొట్టమొదటి సారిగా ఈనెల 27న స్వస్థలానికి వస్తున్నారు. ఈసందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం మంగళవారం జామి కాంప్లెక్స్‌లో కార్యకర్తలతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. సీనియర్ టిడిపి నాయకులు మాజీ ఏఎంసీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, తోటపల్లి ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంటకు అందరు పార్వతీపురం చేరుకోవాలన్నారు. అక్కడ నుండి వీరఘట్టం మీదుగా పాలకొండకు వస్తారన్నారు. ఈ కార్యక్రమానికి పాలకొండ నియోజకవర్గంలోని వీరఘట్టం మండలంతో పాటు పాలకొండ, సీతంపేట, భామిని మండలాల నుంచి కార్యకర్తలు అందరూ భారీగా తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. వీరఘట్టం మండల పార్టీ అధ్యక్షుడు ఉదయాన ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పొన్నాడ నాగేశ్వరరావు, వీరఘట్టం పట్టణ టిడిపి అధ్యక్షుడు జామి లక్ష్మీనారాయణ, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు బల్ల హరిబాబు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు పారిసర్ల వెంకటరమణ, మండల తెలుగు యువత అధ్యక్షుడు మాచర్ల అనిల్ బాబు, తూముల రమేష్, మత్స వెంకటరమణ, లెంక మురళి, కడగల దామోదరరావు, ఖండాపు హరిబాబు, గుండ్రెడ్డి హరికృష్ణ, గుంట్రెడ్డి సూర్యనారాయణ, జనసేన నాయకులు మత్స పుండరీకం, సరిపల్లి అచ్యుతరావు పాల్గొన్నారు.




జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మృతుల కుటుంబాలకు పేడాడ పరామర్శ

**బూర్జ, జూన్25(వార్త):**ఇటీవల పిడుగుపాటుకు గురై మరణించిన అయ్యవారిపేటకు చెందిన చోడవరపు సత్యనారాయణ కుటుంబంతోపాటు అదే గ్రామానికి చెందిన ముద్దాడ భాస్కర రావు కుటుంబాన్ని, హనుమయ్యపేటకు చెందిన దుడ్డి రాజు కుటుంబ సభ్యులను జనసేన పార్టీ ఆమదాలవలస నియోజకవర్గం ఇన్చార్జ్ పేడాడ రామ్మోహనరావు మంగళవారం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పరామర్శించిన వారిలో మండల ఉపాధ్యక్షులు మజ్జి రాంబాబు, తోట అప్పలరాజు, మజ్జి దిలీప్, కీర్తి, రాజశేఖర్, మామిడి ప్రవీణ్, ఇప్పిలి శ్రీధర్, దొడ్డి రాజు, దొడ్డి ప్రసాద్, పైడి తారకేశ్వర్‌రావు ఉన్నారు.





### మరువాడ పాఠశాలకు
## కంప్యూటర్, ప్రింటర్లు వితరణ

**సంతబొమ్మాళి, జూన్ 25(వార్త):** మరువాడ ఎంపీయుపి స్కూల్‌కి మరు వాడ యువసేన యూత్ అసోసియేషన్ సభ్యులు రూ.45 వేలు విలువచేసే కంప్యూ టర్ పరికరాలు వితరణగా అందజేశారు. వీటిని విద్యా కమిటీ చైర్మన్ సూరాడ దాసరాజు చేతుల మీదుగా హెచ్‌ఎం రాజీవ్‌కు అందించారు. ఈ సందర్భంగా దాసురాజు మాట్లాడుతూ యూత్ పెద్దలు సహకారంతో పాఠశాల అభివృద్ధికి డెల్ సిపియు, వ్యూ సోనిక్ మానిటర్, హెచ్ పి ప్రింటర్ అందజేశామని తెలిపారు. ఈ సందర్భంగా మరువాడ యూత్ అసోసియేషన్, గ్రామ పెద్దలకు విద్యార్థులు తల్లిదండ్రుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు,యువకులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరం

**మెళియాపుట్టి, జూన్ 25(వార్త):** మెళియాపుట్టి మండల కేంద్రంలోని గత రెండు రోజులుగా జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో జి.భాస్కర్‌రావు పరిశీలించారు. ఆది, సోమవారాల్లో మెళియాపుట్టి మండల కేంద్రంలో పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి రేఖాన వాసు కాలువల్లో పూడికలను తీయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సీహెచ్ అప్పారావు, వైస్ సర్పంచ్ మాడుగుల భానుజీ, పాతపట్నం నియోజకవర్గ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర్ రెడ్డి, టీడీపీ మండల యువత అధ్యక్షుడు బస్వ పరమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్ల సంక్షేమానికి చర్యలు

**హిరమండలం, జూన్ 25(వార్త):**డ్రైవర్ల సంక్షేమానికి చర్యలు తీసుకుం టున్నట్లు చెవిటమ్మ తల్లి డ్రైవర్స్,ఓనర్స్ సంఘం అధ్యక్షుడు సర్పవరపు లక్ష్మణరావు అన్నారు. మంగళవారం చెవిటమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి, ముగ్రాటలు చేసి అమ్మవారికి చల్లదనం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘ అభివృద్ధికినెలవారీ సభ్యత్వ రుసుం అందజేయాలన్నారు. సమావేశంలో సభ్యులు సతీష్, తట్ల శంకరరావు, శరత్, మహేష్, చోడి సింహాచలం, వానపల్లి శ్రీను, మిన్నారావు పాల్గొన్నారు.

### నిబంధనలకి విరుద్ధంగా
## హెబ్రోన్ స్కూల్ నిర్వహణ

**ఇచ్ఛాపురం, జూన్25 (వార్త):** స్థానిక హెబ్రోన్ మిషన్ స్కూల్ యాజ మాన్యం నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలను నిర్వహిస్తున్నారు. తఒక చోట అను మతులు పొంది వేరొక చోట అదనపు తరగతి గదులు నిర్వహిస్తున్నారు. ఇటీవలే ఎంఈఓ కె.అప్పారావు పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు స్థానిక కెనరా బ్యాంక్ మేడ మీద గతంలో ప్రగతి జూనియర్ కాలేజీ నిర్వహించిన ప్రాంతంలో అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా వేరే చోట స్కూల్ నిర్వహిస్తూ విద్యార్థులు జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. ఈ విషయంపై పాఠశాల యాజమాన్యానికి వివరణ కోరగా ఇటీవలే ఈదురుగాలులకు షెడ్‌పైకప్పులు ఎగిరి పోవడంతో తాత్కాలికంగా షిఫ్ట్ చేశామని తెలిపారు.



## తాగునీటి సమస్య లేకుండా చూడాలి

**సంతబొమ్మాళి, జూన్ 25 (వార్త):** రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని ప్రతి గ్రామంలోను తాగునీరు సమస్య లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ ఉమాసుందరి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల్ లెవల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా గ్రామాలలో తాగునీటి వనరులు పరిస్థితి పరిశీలించి అవసరం మేరకు మరమ్మతులు చేయించాలన్నారు. బావులు, వాటర్ ట్యాంక్‌లలో క్లోరినేషన్ చేయించాలని, ప్రతి గ్రామంలోను పారిశుధ్యం మెరుగుపడేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందు కోసం మండల లెవల్ అధికారుల పర్యవేక్షణలో సచివాలయం సిబ్బంది ఇంటింటా సర్వే చేపట్టాలని ఎంపీడీఓ సిబ్బందికి తెలిపారు. ఈ సర్వే మూడురోజులు పాటు నిర్వహించి పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని కార్యదర్శులకు ఎంపీడీఓ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మధు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

**శ్రీకాకుళం టౌన్, జూన్ 25 (వార్త):** విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, పేదరికం చదువుకు అడ్డుకాకూడదని చిక్కోలు పక్కా లోకల్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత రాయితీ శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని పుణ్యపువీధికి చెందిన దేవ్ గాయత్రికి చిక్కోలు పక్కా లోకల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇంటర్మీడియట్‌లో 970 మార్కులు సాధించి గాయత్రి సత్తా చాటింది. ప్రస్తుతం ఆమె కుటుంబం ఆర్థిక ఇబ్బంది కారణంగా విద్యను మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. విష యం తెలుసుకున్న చిక్కోల్ పక్కా లోకల్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఫోన్ పే ద్వారా రూ.25 వేలను ఆ కుటుంబానికి అందజేశారు. ఆకుటుంబ సభ్యులు చిక్కోలు పక్కా లోకల్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.




Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413